


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప

సోమవారం 25 ఆగస్టు 2025

పేజీలు - 08




## బార్ పాలసీ

# బేర్..

### కొత్తపాలసీకి స్పందన కరవు
### బార్ దరఖాస్తులకు ముందుకురాని వ్యాపారులు
### జిల్లాలో నేటివరకు రెండే దరఖాస్తులు
### ఖంగుతిన్న ఎక్సైజు ఉన్నతాధికారులు
### దరఖాస్తులు పెంచాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి
### లబోదిబోమంటున్న ఫీల్డు ఆఫీసర్లు
### సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్లు

కడప బ్యూరో - మేజర్ న్యూస్

రాష్ట్రంలో బార్ పాలసీ నెలాఖరుతో ముగుస్తుంది. సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అమలు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా 840 బార్లకు నోటిఫికేషన్ జారీ అయింది. అందులో కడప జిల్లాకు సంబంధించి 29 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. వాటిలో కల్లుగీతలకు 2 కేటాయించారు. ఈనెల 26తో దరఖాస్తు గడువు ముగుస్తుంది. 28న లాటరీ విధానంలో లైసెన్స్‌లు ఖరారు చేస్తారు. అయితే కల్లుగీత కులాలకు ఈ నెల 29 చివరి తేది. కాగా వందల్లో దరఖాస్తులను ఆశించగా అవి పదుల సంఖ్యలో కూడా రాకపోవడంతో అధికారులు ఖంగుతిన్నారు.ఆదివారం వరకు కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. అంటే రూ. 10 లక్షలు డిపాజిట్ రూపంలో లభించింది. ఇప్పటివరకు ..మిగతా 2వపేజీలో

**నూతన మద్యం పాలసీపై బార్ వ్యాపారులు బేర్ మంటున్నారు. పాలసీలో విధించిన ఆంక్షలపై వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ వ్యాపారంలో ఉన్నవారు సైతం దరఖాస్తు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలపై తర్జన..భర్జన పడుతున్నారు. కడప జిల్లాలో 29 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా నేటికీ కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 26 దరఖాస్తులకు చివరి తేదీ. 28న లాటరీ విధానంలో లైసెన్స్ లు ఖరారు చేస్తారు. అయినా వ్యాపారులు బార్ల నిర్వహణకు దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం లేదు. అధికారులు మాత్రం ఒక్కో బార్ కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లైసెన్స్ కు లాటరీ నిర్వహిస్తామని, లేకుంటే లేదని స్పష్టం చేస్తున్నారు. దరఖాస్తుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉంది.**

### ప్రారంభానికి సిద్ధమవుతున్న

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

### ప్రారంభ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్..!
### ముందస్తు పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్, ఎస్పీ



పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ : మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ, విజయ దుర్గ కాలనీ సమీపంలో 10.55. ఎకరాల సువిశాల స్థలంలో, దాదాపు 12 కోట్ల అంచనా వ్యయంతో 2019 వ, సంవత్సరం ఫిబ్రవరి 03 వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా (ఆన్‌లైన్‌లో) పునాదిరాళ్లు పడ్డ ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం దాదాపు 5 సంవత్సరాల తర్వాత కూటమి ప్రభుత్వంలో ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన స్వహస్తాలతో ..మిగతా 2వపేజీలో

### జాతీయ రహదారిలో నిలచిన

# అప్రోచ్ రోడ్డు పనులు..!

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు
### వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి
### అధికారులకు ప్రజలు మొర

2లో



దువ్వూరు, మేజర్‌న్యూస్ : కర్నూలు-కడప జాతీయ రహదారిలో దువ్వూరు మండల పరిధిలోని చాలా చోట్ల అప్రోచ్ రోడ్లు వేయకుండా నిలుపుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిలో అప్రోచ్ రోడ్లు వేయకుండా టోల్గేట్ వసూలు చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికి అవి పాటించకుండా వాహన దారుల వద్ద టోల్ వసూలు చేస్తున్నారు. అలాగే ఈ రహదారి లోని దువ్వూరు మండల పరిధిలోని గుడిపాడు గ్రామం వద్ద అప్రోచ్ రోడ్డు చాలా అద్వానంగా ఉందని ఆ రోడ్డు ద్వారా వెళ్లే 10 గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్రోచ్ రోడ్డుపై వెళ్లే గుడిపాడు, భీమునిపాడు, సంగటి తిమ్మాయ పల్లె,

### సంజీవరాయిని ఆలయ...

# పునఃనిర్మాణానికి మహర్దశ

### అద్భుతమైన నైపుణ్యంతో నిర్మాణం
### 15అడుగులకు చేరుకున్న ఆలయ కట్టడాలు



రాజుపాళెం, మేజర్‌న్యూస్: ఈ ప్రాంతంలో లేని విధంగా వెల్లాల శ్రీసంజీవరాయస్వామి ఆలయ పునఃనిర్మాణపనులు అద్భుతమైన నైపుణ్యంతో జరుగుతున్నాయి ఇప్పటికే ఆలయం కట్టడాలు గ్రానైట్ రాయితో పునాది నుండి 15 అడుగులకు చేరుకుంది ఇక నాలుగడుగులు ఎత్తు నిర్మాణ పనులు మిగతా 2వపేజీలో

### నగరంలో....

# చవితి శోభ

### సిద్ధమవుతున్న వినాయక మండపాలు
### మండపాలకు చేరుతున్న గణపయ్య ప్రతిమలు
### చవితి పండుగ పనుల్లో భక్తులు



కడప రూరల్ మేజర్ న్యూస్: విఘ్నాలను తొలగించి శుభాలు చేకూర్చ్చ వినాయక చవితి పండుగ శోభ నగరంలో సంతరించుకుంది. గణపయ్య కొలువుదీరే మండపాలు ఊరువాడ కనువిందు చేస్తున్నాయి. పండుగ 15 రోజులు మిగతా 2వపేజీలో

## శుద్ధి.. పచ్చి అబద్ధం

8లో



# ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

(మొదటి పేజీ తరువాయి)



సెప్టెంబర్ రెండవ తేదీ నాడు ప్రారంభిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా కళాశాల భవనాన్ని ముందస్తు పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఐఎన్ఎల్. వెంకటేశ్వర్లుతో అధికారులు కళాశాల భవనానికి చెందిన అన్ని విషయాలను కూలంకషంగా చర్చిస్తూ ప్రతి ఒక్క గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వచ్చే సమయానికి ఇక్కడున్న పనులన్నీ పూర్తిచేయాలని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని వారు కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, మం డల తహసిల్దార్ అనురాధ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌పిజిఆర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిలో నిలచిన అప్రోచ్ రోడ్డు పనులు..!

(మొదటి పేజీ తరువాయి)



అన్నపుశాస్త్రిపల్లె, బుక్కయ్య పల్లె, చిన్న అగ్రహారం, అన్నవరం, మదూరు, తదితర గ్రామాల ప్రజలు వెళ్ళుతున్నారు. కొద్దిపాటి వర్షం పడితే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదని ప్రజల ఆరోపిస్తున్నారు, ఇటీవల రైతులు లారీలో సిమెంట్ బస్తాలు తీసుకెళ్లడానికి ఆ దారిలో వెళితే ఆ లారీ ఆ బురదలో ఇరుక్కుపోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. జాతీయ రహదారిలో టోల్ గేట్ వసూలు చేస్తున్నారే గాని చిన్నచిన్న అప్రోచ్ రోడ్లను కూడా వేసే పరిస్థితులు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే గుడిపాడు గ్రామం వద్ద బ్రిడ్జి కింద హైవే వారు వేసిన ఎల్ఈడి బల్బులు వెలగడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. చీకటి పడితే ఆ దారిలో వెళ్లాలంటే నరకయాతన కనిపిస్తుందని వెంటనే బ్రిడ్జి కింద లైట్లు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.అప్రోచ్ రోడ్లు త్వరగా పూర్తి చేయాలని ఈ ప్రాంతపు ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో ఎన్నిసార్లు హైవే అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ఈ ప్రాంతపు ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సంజీవరాయిని ఆలయ... పునఃనిర్మాణానికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతే గర్భగుడిపై పై కప్పు పనులు చేపడతారుగర్భగుడి అంతరాలయం మహా మండపాల నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి సెప్టెంబర్ చివరి కల్లా ఈ కట్టడాలు పైకప్పు వరకు నిర్మాణం పూర్తయ్య అవకాశం కనిపిస్తున్నాయి ఆ తర్వాత గర్భగుడిపై రాజ గోపురం ఆలయం చుట్టూ సలహారం నిర్మాణాలు చేపడతారు దేవస్థానం సర్వ శ్రేయ నిధిరూ65 లక్షలు దేవాదాయ శాఖ సిజిఎఫ్ నిధులు రూ2.90 కోట్లు మొత్తంరూ3.55 కోట్ల రూపాయలు ఈ ఆలయ నిర్మాణానికి వెచ్చిస్తారు శ్రీ సంజీవరాయస్వామి ఆలయం పక్కనే ఉన్న పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి దేవదాయ శాఖ సిజిఎఫ్ నిధులురూ4 కోట్లు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కృషితో నిధులు మంజూరు అయ్యాయి దేవస్థానం కాంట్రిబ్యూషన్ కింద రూ80 లక్షలు దేవదాయ శాఖ సిజిఎఫ్ నిధులు రూ3.20 కోట్లు కేటాయించారు ఈ ఆలయ పునఃనిర్మాణానికి సిజిఎఫ్ కాంట్రిబ్యూషన్ కింద విరాళం అందించేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు ఉత్సవ కమిటీ సభ్యులు గంగిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి ఆలయ ఈవో కె.వి.రమణ ఆధ్వర్యంలో భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి

# బార్ పాలసీ..బేర్!

(మొదటి పేజీ తరువాయి)

50 దరఖాస్తులకు పేర్లు నమోదు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కొక్క బార్‌కు నాలుగు అప్లికేషన్లు వస్తేనే లక్కీ డ్రిప్ లేదంటే మళ్లీ టెండర్ పిలుస్తారు. జిల్లాలోని కమలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాలకు చెందిన బార్లకు మాత్రం సంవత్సరానికి రూ. 35 లక్షల ఫీజు. మిగిలిన అన్ని ప్రాంతాలకు రూ. 55 లక్షల ఫీజు. ప్రతి సంవత్సరం అదనంగా రెన్యువల్‌కు ఉన్న అమౌంట్ లో 10 శాతం పెంచడం జరుగుతుంది. ఈనెల 28న కలెక్టర్ కార్యాలయంలో బార్ల యాజమానుల ఎంపిక లక్కీ డ్రిప్ నిర్వహిస్తారు. ఈ కొత్త బార్ పాలసీలో దరఖాస్తు రూపంలో రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ (వెనుకకు ఇవ్వని) కింద చెల్లించాల్సిందే. కేవలం దరఖాస్తు రుసుము ద్వారానే జిల్లా నుంచి రూ.5.8 కోట్లు రాబట్టాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 29 బార్లకు నాలుగేసి చొప్పున కనీసం 116 దరఖాస్తులు రావాల్సి ఉంటుంది. ఒక్కొక్క దరఖాస్తుకు రూ.5లక్షల చొప్పున రూ.5.8 కోట్ల పై చిలుకు రాబడి వస్తుందని అంచనా వేశారు. గతేడాది మద్యం షాపులకు వచ్చిన స్పందన ఆధారంగా అధికారులు ఇలా లెక్కలేశారు. అయితే, కొత్త బార్ పాలసీపై అధికారుల అంచనాలు తల్ల కిందులయ్యాయి. గత ఏడాది మద్యం పాలసీతో ప్రభుత్వానికి ఊహించని ఆదా యం వచ్చింది. ఒక్కొక్క మద్యం షాపుకు సగటును 15 నుంచి 20 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుము కింద ప్రభుత్వానికి ఊహించని ఆదాయం సమకూరింది. దీంతో ఎక్సైజ్ అధికారులు కొత్త బార్ పాలసీపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఆక్షన్ విధానం ఎత్తేసి లాటరీ విధానం తీసుకొచ్చారు. మరో వైపు రెస్టారెంట్ నిబంధన, దరఖాస్తు ఫీజు వాపసు వంటి వ్యవహారాల్లో కొన్ని మినహా యింపులు కూడా ఇచ్చారు. ఇంత చేసినా ఎక్సైజ్ శాఖ ఆశించిన లక్ష్యాలు చేరుకోలేకపోతోంది.

**ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు తప్పనిసరి..**

ఒకవైపు కొత్తగా బార్ లైసెన్సులు పొందాలంటే దరఖాస్తు రూపంలో రూ. ఐదు లక్షలు నాన్ రిఫండబుల్ (వెనుకకు ఇవ్వని) కింద చెల్లించాల్సిందే. ఇంకోవైపు ఒక బారికి నాలుగు దరఖాస్తులు వస్తేనే తప్ప లాటరీ విధానం అమలులో ఉంటుందని షరతు విధించారు. ఇంతకు ముందు బార్ లైసెన్సు పొందేందుకు ఈ వ్యాపారంలో అనుభవం ఉన్న హేమాహేమీలు రంగంలోకి దిగేవారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి అనుకూలంగా ఉన్న నేతలు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి బార్, వైన్ షాపులు సొంతం చేసుకోవడం ఆనవాయితీగా మారింది. గత ప్రభుత్వంలో ఒక బార్ లైసెన్సు గడువు ఐదేళ్లుగా ఉండేది. తాజా మద్యం విధానంలో ఈ గడువు కాస్త మూడేళ్లకు కుదించారు. అంటే ప్రతీ ఏడాది జాగ్రత్తగా వ్యాపారం చేసుకుంటేనే ఒడ్డెక్కేది.

**బార్ వ్యాపారుల్లో నిరాశ..**

బ్రాందీ షాపులు, బార్లు ఏవైనా సరే సిండి కేట్లుగానే రంగంలోకి దిగుతారు. అదీ మద్యం వ్యాపారంలో ఏళ్ల తరబడి ఉన్న వాళ్లే ఎక్కువగా ఉంటారు. కొత్తవాళ్లు రావడం, నిలదొక్కుకోవడం అరుదు. ఇప్పుడు కొత్త బార్ పాలసీపై ప్రస్తుత బార్ వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలం విధానంతో ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. అందువల్ల వైసీపీ హయాంలో ఆ విధానాన్ని అమలుచేశారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో లాటరీ విధానాన్ని అమలు చేస్తోంది. జనాభా ప్రాతిపాదికన ఫీజు ఫిక్స్ చేసి లాటరీ వేస్తున్నారు. అయితే ఒక్కో బార్‌కి కనీసం 4 దరఖాస్తులు వస్తేగానీ లాటరీ వేయరు. ఒక్కో దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు మొత్తం రూ.5.10 లక్షలు చెల్లించాలి. అంటే నలుగురు కూటమిగా ఏర్పడి ఒక బార్ కు నాలుగు దరఖాస్తులు సమర్పిస్తే.. ఆ దరఖాస్తు వెల రూ.20.40 లక్షలు అవుతుంది. బార్ ఏడాది లైసెన్సు ఫీజు కలుపుకుంటే.. మొత్తం రూ. కోటి పైనే అవుతుంది. నిర్వహణ ఖర్చులు, వడ్డీలు వంటివి కలుపుకుంటే బార్లో రోజుకు అమ్మకాలు కనీసం రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు పైగా ఉంటేనే గిట్టు బాట వుతుందని లెక్కలు వేస్తున్నారు. ఇప్పుడు మద్యం షాపుల్లో అన్ని బ్రాండ్ల మద్యం దొరుకుతోంది. దాంతో బార్లలో అదనపు ధరలతో అమ్మితే ఎంతమేర విక్రయాలు సాగుతాయన్నది మరో ప్రశ్న. పర్మిట్ రూము పర్మిషన్ ఇస్తున్నందున వాటి ప్రభావం కూడా బార్లపై పడే అవకాశం ఉంది. ఒక బారికి 4 దరఖాస్తులు, ఇష్యూ ప్రైస్ పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ (ఏఆర్టీ) వసూలు అంశాలపైనా వ్యాపారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇవన్నీ బేరీజు వేసుకుంటే వ్యాపారం చేయడం కష్టమేనన్నది వ్యాపారుల అభిప్రాయం. ప్రభుత్వం పాలసీలో అనుకూల మార్పులు తీసురావాలని డిమాండు వినిపిస్తోంది.



# నగరంలో చవితి శోభ

(మొదటి పేజీ తరువాయి)

ముందు నుండే యువకులు గణపయ్య పేరుతో చందాలు ప్రజల నుండి వసూలు చేసి, స్వామివారు కొలువుదీరే మండపాలను రకరకాల రూపాలలో అబ్బురపరిచే విధంగా కూలీలతో ఏర్పాట్లు చేసుకొని, విద్యుత్ కాంతులు వెదజల్లే విధంగా చేసిన దీపాలంకరణ కనువిందు చేస్తున్నాయి. ఇప్పటికే వేల రూపాయలు అడ్వాన్సులు చెల్లించి, రకరకాల భంగిమల్లో రూపుదిద్దుకున్న పార్వతీ తనయ బొజ్జ గణపయ్య ప్రతిమలను మండపాలకు తరలించి పండుగకు భక్తులు సిద్ధం చేసుకున్నారు. వాహనాల్లో గణపయ్య ప్రతిమలను మండపాలకు తరలింపులో భక్తుల సందడి చెప్పనవసరం లేదు. బాణాసంచా పేలుళ్లతో డప్పు వాయిద్యాల మధ్య కూడళ్లలో పండుగ వాతావరణం తలపిస్తుంది. కేవలం తాత్కాలిక మండపాల ఏర్పాట్లకే కొన్నిచోట్ల లక్షలు వెచ్చించినట్లు తెలుస్తుంది. కొన్ని వీధుల్లో మూడు లేక నాలుగు చోట్ల వినాయక మండపాలు గణపయ్య కొలువు కోసం సిద్ధమయ్యాయి. ఏది ఏమైనప్పటికీ గత ఏడు కన్నా ఈ ఏడు మరింత సందడిగా వినాయక చవితి పండుగను బుధవారం ప్రజలు ఘనంగా భక్తితో జరుపుకోనున్నారు.

**మట్టి గణపతే మహాగణపతి**

కుమ్మరుల చేత రూపు దిద్దుకుని, సహజ సిద్ధమైన రంగులు అద్దుకుని, గురివిందెలను నేత్రాలుగా, సర్పాన్ని మొల త్రాడుగా, పీఠంపై ఆసీనుడైన మట్టి గణపతే మహాగణపతి. పండుగ రోజు స్వామివారి ప్రతిమను నివాసాల్లోని పూజా గదిలో ప్రతిష్టించి, ఔషధ గుణాల పత్రాలైన (ఆకులు) మాచి పత్రం, వాకుడు, మారేడు, గరిక, ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి, తులసి, మామిడి, గన్నేరు, విష్ణుకాంత, దానిమ్మ, దేవదారు, మరువం, వావిలి, జాజి, ఏనుగు చెవి ఆకు, జమ్మి, రావి, మద్ది, జిల్లేడు పత్రాలను స్వామి కడ ఉంచి, భక్తి తో స్వామికి ఉండ్రాళ్ళు, జొన్న కంకులు, ప్రసాదాలు సమర్పించి, పండుగను చేయడం వల్ల ఆయురారోగ్యాలు చేకూరుతాయి. ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, వృక్షాల పత్రాలు (ఆకులు) ఉండడం వల్ల వాటి నుండి ఔషధ వాయువులు విడుదల కావడంతో నివాసాల్లోని రోగాలు కలిగించే సూక్ష్మ క్రిములు నశిస్తాయి. అందులో భాగంగానే పెద్దలు గడపలకు పండుగలకు, పబ్బాలకు మామిడి తోరణాలు అలంకరింప చేస్తారు. మామిడి పత్రం చెట్టు నుండి విడదీసిన తరువాత కూడా ఐదు రోజులు ఔషధ వాయువులను విడుదల చేస్తాయని అన్నది గ్రంథాలలో నిక్షిప్తమై ఉంది. మూడు రోజులు పూజలందుకున్న స్వామిని వ్యవసాయ భూములకు నీరందించే చెరువుల్లో గణపయ్య ప్రతిమలను నిమజ్జనం చేయడంతో ఔషధ గుణాలు కలిగిన పత్రాల వల్ల నీటిలో ఉన్న బ్యాక్టీరియా నశిస్తుంది. ఈ నీటిని తీసుకున్న పశుపక్షాదులు ఆరోగ్యంగ, అనారోగ్యాల బారిన పడకుండా జీవిస్తాయి. వేసవిలో చెరువులు ఎండినప్పుడు చెరువులో మట్టిని వ్యవసాయ భూములకు వినియోగించడం వల్ల భూములు సారవంతమై అధిక దిగుబడులు సాధిస్తాయి. చెట్టును, పుట్టను పూజించే సంస్కృతి, సాంప్రదాయం మనది. అందుకే మట్టి గణపతే మహాగణపతి



## ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి

### మద్యం తాగి వాహనాలు నడపరాదు

### ఎస్ఐ వినోద్ కుమార్



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** వాహనాలు నడిపేవారు ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని దువ్వూరు ఎస్ ఐ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బైపాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికి లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ఇన్సూరెన్స్ పత్రాలు ఉండాలని తెలిపారు. మోటార్ సైకిల్ లో ముగ్గురు వెళ్లకూడదని, హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఐటి విద్యార్థి ఆత్మహత్యపై న్యాయ విచారణ జరిపించాలి




కడపఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : ఐఐటి విద్యార్థి ఆత్మహత్యపై న్యాయ విచారణ జరిపించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోరడం జరిగిందన్నారు. ఆదివారం ఈ సందర్భంగా కడప నగరం ఆర్ ఆర్ ఎస్ యు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కడప జిల్లా పులివెందుల నియోజవర్గం వేంపల్లి మండలం ఇడుపులపాయలో ట్రిబుల్ ఐటీ లో జరిగిన ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి కారణాలు ఏంటి అని నెల క్రితమే అక్కడ భోజనం సంబంధించి పురుగులు రావడం పై విద్యార్థులు అక్కడ ధర్నా నిర్వహించడం జరిగిందని అయితే ఇంతవరకు దానికి పరిష్కారం చేయనటువంటి పరిస్థితి ఉందని అయితే దానికి పరిష్కారం చేయకపోగా వారి యొక్క నిర్లక్ష్యంతో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నరసింహనాయుడు అనే విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడని ఇందులో ప్రధానంగా అతను చనిపోవడానికి కారణం ఏంటి అతనికి ఏమైనా ఒత్తిడి ఉందా లేకపోతే ఈమధ్య జరుగుతున్నటువంటి ర్యాగింగ్ వలన లేకపోతే అతనికి ఏమైనా బెదిరింపులు చేయడం జరిగిందా అని మేము ప్రశ్నిస్తున్నాం అయితే దీనిపై సరైన విచారణ జరిపి క్లుప్తంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఏవో రవికుమార్లు తెలపాలని అదేవిధంగా విద్యార్థి కుటుంబానికి వారి తల్లిదండ్రులకు సరైన న్యాయం చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు దీనిపై సరైన విచారణ చేపట్టకపోతే ఎలాంటి స్పందన లేకుండా యాజమాన్యం ఉంటే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనల కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## శివ శంకర నాయుడును పరామర్శించిన వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు సమీప బంధువు శివశంకర్ నాయుడు ఇటీవలి కాలంలో ప్రమాద వశాత్తూ గాయపడటం జరిగింది, హైదరాబాద్ ఆసుపత్రి లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా అతని ఇంటికి వెళ్లి పరామర్శించిన మున్సిపల్ ఇంచార్జి వైయస్ మనోహర రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి అతని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. వీరితో పాటు పరామర్శించిన వారిలో ఆంజనేయులు నాయుడు, కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి,గ్రామం లోని కార్యకర్తలు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సదరం సర్టిఫికెట్లలో సవరణకు దివ్యాంగులకు అవకాశం కల్పించాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** కొత్త సదరం సర్టిఫికెట్లలో సవరణ కు దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఆల్‌ఆఫ్‌యు దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ పార్కు వద్ద సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ సదరం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం సుదీర్ఘ కాలంగా అంగవైకల్యంతో తీసుకుంటున్న అర్హులైన దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడం బాధాకరమైన విషయమని ఇది కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం సహితుకమైన చర్య కాదని తెలియజేశారు. అన్ని రకాల దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు ఈ సంవత్సరం జనవరి నుండి రి వెరిఫికేషన్ చేస్తున్న అధికార యంత్రాంగం ఈ నెల 10వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో ఉన్న దివ్యాంగులందరికీ కొత్త సదరం సర్టిఫికెట్లు ఇచ్చారని, కొత్త సదరం సర్టిఫికెట్లలో అనేక తప్పుడు ఫోటోలు, పర్సంటేజులు తప్పుగా నమోదు చేయడం జరిగింది. సెర్ఫ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పిన స్టేట్మెంట్ ప్రకారం దివ్యాంగులలో టెంపరరీ సర్టిఫికెట్ వచ్చిన వాళ్లకు నోటీసులు రద్దుచేసి, వాళ్ల పింఛన్ కంటిన్యూ చేయడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాత సర్టిఫికెట్ల గురించి ఆయన మెన్షన్ చేయలేదని, సదరం సర్టిఫికెట్‌లో జరిగిన తప్పులు సవరించడానికి అవకాశం ఇస్తున్నట్లు, ఆప్షన్ ఇవ్వడానికి గాని ఆయన ప్రయత్నం చేయలేదన్నారు. ప్రభుత్వం ఏ ఒక్కరికి పెన్షన్లు తీసేయలేదని డబ్బా కొట్టుకోవడం తప్ప ఏమి లేదని, ఈ సదరం వెరిఫికేషన్‌లో చాలామంది శారీరక, మానసిక ఆర్థోపెడిక్ వారికి తీవ్రమైన అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం రీ వెరిఫికేషన్ నందు కొత్త సదరం సర్టిఫికెట్లలో జరిగిన తప్పులు, ఫోటోలు, పేర్లు సవరించడానికి దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాజా మొహిదీన్, మహేష్ కుమార్ , ఓబులేసు నారాయణస్వామి, గుర్రప్ప, అబ్దుల్ రషీద్, యదార్థుడు తదితరులు పాల్గొన్నారు.

## చిలంకూరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఎర్రగుంట్ల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివిన 1982-83 బ్యాచ్ కు సంబంధించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 42 సంవత్సరాల క్రితం ఇదే పాఠశాలలో పదవ తరగతి వరకు చదివి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆత్మీయంగా కలుసుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యార్థి దశలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను, తరగతి గదిలో కూర్చొని అప్పటి తీపి గుర్తులను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఆనాటి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు.

## నేరస్తులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

### నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**వేంపల్లె మేజర్ న్యూస్:** నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు ఇకమీద సత్ప్రవర్తన కలిగి ఉండాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ చేశారు. జీవితంలో మార్పు రావాలని, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా మెలగాలని హెచ్చరించారు. పదేపదే కేసుల పాలవుతూ రౌడీషీటర్లుగా నమోదు అయి జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు.

## లాడ్జిలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్ :** కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లాడ్జిలను ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు, కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప వన్ టౌన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు ప్రతిష్టమైన చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టారు, లాడ్జిలలో ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి బస చేసిన వ్యక్తుల వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు, అనుమానం వచ్చిన కొత్త వ్యక్తులను వివరాలను అడిగి ఆరా తీశారు, లాడ్జిలలో బసజేసే వ్యక్తుల నుంచి ఆధార్ కార్డులు వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లో పొందపరచాలని నిర్వాహకులకు సూచించారు, చట్ట విరుద్ధంగా అనుమానిత వ్యక్తులకు గదులు ఇవ్వరాదని పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు, అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిలలో అసోసియేషన్ సమయంలో పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు, ఈ తనిఖీల్లో వన్ టౌన్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం

### ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి



**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** సైక్లింగ్ వల్ల ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి తెలియజేశారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలు సైక్లింగ్ అలవాటుగా చేసుకోవడం వల్ల శారీరకంగా ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమానికి ముఖ్య ఉద్దేశం అన్నారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరిక వ్యాయామానికి దోహదపడుతుందన్నారు. సహజ సిద్ధమైన ఈ వ్యాయామాన్ని ప్రతి ఆదివారం అలవాటుగా చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తమ పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ నాగ మురళి సిబ్బంది ఉన్నారు.

## బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఉచిత మెగా వైద్య శిబిరం



**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఇందిరానగర్ భద్రాద్రి రామాలయం ప్రాంగణంలోబాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతకొమ్మదిన్నె సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 300 మంది వరకు ప్రజలు హాజరై తమ ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ పనిచేస్తోంద న్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# మట్టి గణపతి విగ్రహాలను ప్రతిస్టిద్ధాం.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం..!



**మట్టివిగ్రహాలనుప్రతిష్టిద్దాంపర్యావరణన్ని కాపాడుదాంఅనే పోస్టర్ విడుదల..**
**బద్వేల్ అర్బన్ సి.ఐ. లింగప్ప**

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం రాబోవు వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని పర్యావరణ కాలుష్య నివారణకు అందరం పాటు పడదామని బద్వేల్ అర్బన్ సిఐ శ్రీ లింగప్ప గారు తెలిపారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్ ను ఆదివారం బద్వేల్ అర్బన్ స్టేషన్లో సిఐ లింగప్ప పోస్టర్లను ఆవిష్కరణ చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం అవ్వాలన్నారు. వాతావరణ కాలుష్యం కారణంగా వాతావరణం లో మార్పులు సంభవిస్తూ వస్తున్నాయన్నారు.ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వలన నీటి కాలుష్యం ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని అందరంపర్యావరణాన్నికాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం వారికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐజిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వద్దు మట్టి గణపతి విగ్రహాలు ప్రతిష్టిద్దాం అన్నారు. రాబోవు వినాయక చవితి పండుగను కుల, మతాలకతీతంగా ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు.ఇప్పటికే పర్యావరణ కలుస్తాం అనేక రూపాలలో కలుషితం అవుతుందన్నారు. ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలు పాడటం చేత నీటిలో కరగడం చాలా రోజులు పడుతుందని కాలుష్యం ద్వారా నీటిలోని జీవరాసులు చేపలు వంటివి చనిపోయే ప్రమాదం ఉందని వైద్యులు నిపుణులు అనేక సందర్భాలలో చెబుతున్నారన్నారు.పర్యావరణ పరి రక్షణ కోసం డివైఎఫ్ఐ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, పట్టణ నాయకులు సుధాకర్, ప్రసాద్ రెడ్డి, ఎస్ కె ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

**డీఆర్వో విశ్వేశ్వర నాయుడు**

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు లినమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్ సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం..**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఊడవగండ్లలో రహదారి మరమ్మతులు ప్రారంభం

**ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచ్ దాసరి ప్రతిమ**





**తొండూరు, మేజర్‌న్యూస్ :** తొండూరు మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో వర్షాల కారణంగా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి, గ్రామ ప్రజలు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, గర్భిణీలు, అత్యవసర సేవలకు వెళ్లే వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులను పడుతున్నారు.

**ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన సర్పంచ్**

గ్రామ సర్పంచ్ దాసరి ప్రతిమ గారు ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా స్వయంగా రంగంలోకి దిగారు. రహదారుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. "గ్రామ ప్రజలు పడుతున్న కష్టాలను తొలగించడం నా ప్రధాన కర్తవ్యం" అని ఆమె స్పష్టం చేశారు.

**అత్యవసర సమావేశం - తక్షణ చర్యల ఆదేశాలు**

గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి రహదారి మరమ్మతులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చి, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పైపులైన్ వద్ద దెబ్బతిన్న ప్రాంతాలను తక్షణం సరిచేయాలని చెప్పారు.

**శాశ్వత పరిష్కారానికి కృషి**

తాత్కాలిక మరమ్మతులతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిధులను సమీకరించేందుకు ప్రయత్నిస్తామని సర్పంచ్ ప్రతిమ గారు తెలిపారు. "గ్రామ ప్రజలకు మంచి మౌలిక సదుపాయాలు అందించడం కోసం పగడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తాను" అని ఆమె హామీ ఇచ్చారు.

**ప్రజల సంతోషం, కృతజ్ఞతలు**

సర్పంచ్ తీసుకున్న ఈ చర్యలపై ఊడవగండ్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే గుర్తించి స్పందించినందుకు సర్పంచ్ ప్రతిమ కి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ కృషి చేస్తున్న సర్పంచ్‌గారిని గ్రామస్థులు అభినందించారు.

**ప్రస్తుతం జరుగుతున్న పనులు**

ఇప్పటికే ఊడవగండ్లలో రహదారి గుంతలు పూడ్చే పనులు, పైపులైన్ మరమ్మతులు ప్రారంభమయ్యాయి. స్థానికులు కూడా ఈ పనులకు సహకరిస్తున్నారు. తాత్కాలికంగా కష్టాలను తగ్గించేందుకు పంచాయతీ చొరవతో పనులు వేగంగా సాగుతున్నాయి.

# 2003 డిఎస్సీ ఉపాధ్యాయ రాష్ట్రఫోరమ్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి

**గుజ్జల తిరుపాల్, కావేటి ఉదయ్ భాస్కర్**



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** 2003 డిఎస్సీ ఉపాధ్యాయ ఫోరమ్ ఆధ్వర్యం లో 25 వ తేది సోమవారం ఉదయం 9 గంటలకు విజయవాడ లోని ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని ఉమ్మడి వై. ఎస్. ఆర్ కడప జిల్లా లోని 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు గుజ్జల తిరుపాల్ ఆధ్వర్యం లో స్థానిక ఎన్జీవో భవన్ నుండి దాదాపు 100 మందికి పైగా బస్సు ల లో ట్రైన్ ల లో స్వంత వాహనాలలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మిరాజ, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకట శివారెడ్డి, ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ భాష, 2003 డీఎస్సీ ఫోరమ్ జిల్లా కన్వీనర్లు కురుకూటి సుధాకర్, మిద్దె ప్రవీణ్ కిరణ్, బండి. నాగేశ్వర్ రెడ్డి, కందుకూరి వీరప్ర తాప్, బసిరెడ్డి శోభారాణి, కాటబత్తుల సునీత జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు హారతులు పట్టి మహాధర్నా కార్యక్రమం జయప్రదం కావాలని ప్రార్ధించ్చారు.తన ప్రసంగం లో గుజ్జల తిరుపాల్, కావేటి ఉదయ్ భాస్కర్ లు ఇరువురు ఉద్యమం మొదటినుండి మాకు జిల్లా స్థాయి లోను రాష్ట్ర స్థాయి లోను అన్నీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు మద్ద తుగా నిలిచి కేంద్రప్రభుత్వము 57 మెమో ద్వారా ఓపిఎస్ సాధన కోసం అండదండలు అందిస్తున్న నాయకులు అందరికి ధన్యవాదాలు తెలియజేసారు

# గణేష్ నిర్వాహకులతో ఎస్ఐ పీస్ కమిటీ సమావేశం



**చాపాడు మేజర్ న్యూస్:** గణేష్ నిర్వాహకులతో ఆదివారం చాపాడు ఎస్.ఐ చిన్న పెద్దయ్య స్థానిక పోలీస్ స్టేషన్ లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పెద్దయ్య మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలు ప్రతిష్టించదలచిన వారు ముందస్తు పోలీసు అనుమతి పొంది, ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్ కుమార్ అదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్సవ నిర్వాహకులు సింగిల్ విండో సిస్టం ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ మొబైల్ నెంబర్‌తో ఓటిపి ద్వారా లాగిన్ అయి అప్లికేషన్ సబ్మిట్ చేయాలని తెలిపారు. పోలీస్ వారు వెరిఫై చేసిన తరువాత క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసి మండపం వద్ద అతికించాలని. అదే విధంగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కి వివరాలు అందజేయాలని సూచించారు.కనీసం 5 మంది సభ్యులతో కమిటీ ఏర్పడి, వారి గుర్తింపు కార్డుల నకలు పోలీస్ వారికి చూపించి అనుమతి పొందాలని, ప్రైవేట్ స్థలమైతే యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు.అలాగే ఫైర్ మరియు విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలలో ఇసుక, నీటి బిందెలు సిద్ధంగా ఉంచుకోవాలని. విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండాలని. షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, సమయం, మార్గం, వాహన వివరాలు తప్పనిసరిగా తెలియజేయాల%అఱ%. లౌడ్ స్పీకర్లు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వాడాలని. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు వాడరాదన్నారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద కమిటీ ప్రతినిధులు తప్పనిసరిగా కాపలా ఉండాలన్నారు. పందిళ్లు / మండపాలు రహదారులపై ఏర్పాటు చేయరాదని. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే బ్యానర్లు, ఫ్లెక్సీలు వద్దని సూచించారు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేక నినాదాలు చేయరాదని.అసభ్యకర ప్రదర్శనలు, మద్యం లేదా మత్తు పదార్థాలు వాడరాదని. డీజే సిస్టమ్స్, పేలుడు పదార్థాలు పోలీస్ అనుమతి లేకుండా వాడరాదన్నారు. నిమజ్జనం కోసం ఉపయోగించే వాహనం మంచి స్థితిలో ఉండాలి. లైసెన్స్ ఉన్న డ్రైవర్ తప్పనిసరి.వాహనంలో మైనర్లు, మద్యం సేవించిన వారు ఉండరాదు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని సూచించారు.

# ఘనంగా గంధం మహొత్సవం



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధిగాంచిన కడప అమీన్ పీర్ దర్గాలో ఆదివారం గంధం మహొత్సవం ఘనంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు 10వ పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యదా అమీనుల్లా మహ్మద్ మహ్మదుల్ హుసేని చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే 25న తహలీల్తో పాటు ఉరుసు రోజున ఖవ్వాలి కార్య క్రమం ఉంటుందని వెల్లడి ంచారు. అన్నివర్గాల ప్రజలు గంధం, ఉరుసు మహొత్సవాలు విజయ వంతం చేసేం దుకు తరలిరావాలని కోరారు.

# యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

**జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి – జాబ్ మేళాకు విశేష స్పందన**



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నందు డిక్సన్ సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రం అభివృద్ధి దిశగా పెట్టుబడి పెట్టే కంపెనీలు వస్తున్నాయన్నారు. నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం ప్రగతి వైపు నడుస్తోందన్నారు. అనంతరం ఇంటర్వ్యూలో ఎంపికైన యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అలాగే జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, సీనియర్ నేతలు షబ్బీర్, బాలస్వామిరెడ్డి, తెలంగాణ వలి, నాగభూషణం, బాలకృష్ణారెడ్డి, ఫయాజ్, వేమాకుమార్, రమేష్, మహమ్మద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పొర చికిత్స శిబిరం

**మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు**



**పులివెందుల మేజర్‌న్యూస్ :** మొయిల్ల చెరువుగ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు కంభం తిరుమలరెడ్డి వారి ధర్మపత్ని కీర్తిశేషులు రామలక్ష్మమ్మజ్ఞాపకార్థం కంభము తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు (యూఎస్‌ఏ )వారు శంకర నేత్రాలయము చెన్నై వారి సహకారముతో ఉచిత కంటి వైద్య శిబిరములను గత మూడు సంవత్సరాలుగా డాక్టర్ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పులివెందులలో ఏర్పాటు చేసి పులివెందుల పట్టణము మరియు పరిసర గ్రామ ప్రజల కు ఉచితముగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించడము అభినందనీయము. ఈ సదవకాశమును పులివెందుల గ్రామ ప్రజలకు కల్పించినందుకు పులివెందుల మానవత స్వచ్ఛంద సంస్థ కంభం తిరుమలరెడ్డిని శాలువా ,మెమెంటోతో సత్కరించడమైనది. భవిష్యత్తులో శ్రీ కంభంతిరుమల రెడ్డి మరిన్ని సమాజ కార్యక్రమాలు చేయవలసినదిగా మానవతా సంస్థ వారిని కోరడమైనది. ఈ కార్యక్రమములో మానవతా చైర్మన్ డివి కొండారెడ్డి ,మానవతా కన్వీనర్ బి వి కృష్ణారెడ్డి ,మానవత ప్రెసిడెంట్ జి చంద్రశేఖర్ రెడ్డి ,మానవత సెక్రటరీ ఎం.వి శేషయ్య ,కోశాధికారి బండి హరిచంద్రారెడ్డి ,ఎస్ విశ్వనాథ రెడ్డి , కే గంగిరెడ్డి గారు మరియు శ్రీసోమశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు జన సైనికులు సన్మానం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని బొల్లవరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ మెంబరుగా జనసేన పార్టీ తరఫున రామోజీ ప్రసాద్‌ని ఎన్నిక చేసిన సందర్భంగా ఆదివారం మండలం లోని రాధా నగర్ లో ఎమ్మెల్యే నంద్యాల వరాదరాజుల రెడ్డిని కలిసి వారి సమక్షంలో ప్రొద్దుటూరు కోఆర్డినేటర్ జనసేన నాయకులు శ్రీ సుంకర మురళి మంచి శివకుమార్, తెల్లదార్ల శివ ప్రసాద్ యాదవ్, నరేంద్ర బాబ్జి, అభినందనలు తెలిపారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేస్తాం

**– వైసిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల బోయిన గంగాధర్ యాదవ్**



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కడప జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తను కృషి చేస్తానని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల బోయిన గంగాధర్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల బోయిన గంగాధర్ యాదవ్ ను ఘనంగా సన్మానించిన మనే రాంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మైదుకూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోట రామ మునిరెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. ఇటీవల గంగాధర్ యాదవ్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంగా తన స్వగ్రామం అయిన మనేరామ్ పల్లి గ్రామానికి రావడంతో గంగాధర్ యాదవ్ ను గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, కోట రామమునిరెడ్డి ఇంటిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీదే విజయమని ఆయన అన్నారు. రాష్ట్రంలో అర్హులైన వికలాంగుల పెన్షన్లు తొలగించడం అన్యాయమని, వికలాంగులను ఏడిపిస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు, నిజమైన వికలాంగుల పింఛన్లను వెంటనే మంజూరు చేసి సెప్టెంబర్ నెలలో వారికి పెన్షన్లు అందజేయాలని ప్రభుత్వానికి అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోట రామ మునిరెడ్డి, వైసిపి నాయకులు రమణబోయిన రమేష్ యాదవ్, చిట్టి బోయిన రాముడు,చిట్టిబోయిన మల్లికార్జున, ఇరగంరెడ్డి రంగారెడ్డి, చిట్టిబోయిన గోపాల్ యాదవ్, చిట్టిబోయిన నరసింహులు, బాలయ్య యాదవ్ బాలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలన



**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) ఆదివారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు, ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్ పరికరాలను పరిశీలించారు. డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం కు పలు సూచనలు చేశారు. శిక్షణ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ముందు జాగ్రత్తగా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు ,జిల్లా ఎస్పీ వెంట డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.

# గండి ఆంజనేయుని దర్శించుకున్న పులివెందుల ఆర్డిఓ



**చక్రాయిపేట మేజర్‌న్యూస్ :** చక్రాయపేట మండలం శ్రీ గండి క్షేత్రం ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పులివెందుల ఆర్డిఓ చిన్నయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డిఓ చిన్నయ్యను ఆలయ ప్రధాన అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయననుదృశ్యాలతో సత్కరించి స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శ్రావణమాసం అనంతరం స్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రానున్న కొద్ది రోజుల్లో మూలవిరాట్ విగ్రహ దర్శన భాగ్యాన్ని భక్తులకు కలగజేస్తే బాగుంటుందని ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ సంపూర్ణ ఆరోగ్యానికి మంచిది



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం అని సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో మంచిదని బ్రహ్మంగారిమఠం ఎస్ఐ శివప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలు సైక్లింగ్ అలవాటుగా చేసుకోవడం వల్ల శారీరకంగా ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమానికి ముఖ్య ఉద్దేశం అన్నారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరిక వ్యాయామానికి దోహదపడుతుందన్నారు. సహజ సిద్ధమైన ఈ వ్యాయామాన్ని ప్రతి ఆదివారం అలవాటుగా చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ నుంచి మల్లెపల్లి వరకు ఆరు కిలోమీటర్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఓబులయ్య, రమణ, యానాదిరెడ్డి, రాజేష్,సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక విలువ లేదు

**కూటమి నాయకుల దగ్గర పబ్బం గడుపుకునేందుకే తిరుపాల్రెడ్డి ప్రయత్నం**
**కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఖాదర్**



**పులివెందుల మేజర్‌న్యూస్ :** నిలకడ లేని తిరుపాల్రెడ్డి నువ్వు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక విలువలు లేవని, మా నాయకుడు పులివెందుల నియోజకవర్గం ధ్రువ కుమార్ రెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని, పూటకు ఒక పార్టీ మారే నువ్వు కాంగ్రెస్ పార్టీని, ధ్రువ కుమార్ రెడ్డిని విమర్శించడం నీ స్థాయి ఏమిటో , ఏ పార్టీలో నుండి కూటమిలో చేరావో ఒకసారి, ఆలోచించు కోవాలని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఖాదర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కూటమి నాయకుల దగ్గర పబ్బం గడుపుకునే అందుకే తిరుపాల్రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ఖాదర్ ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుటలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. ఎన్నికల గురించి మాట్లాడే నైతిక విలువలు నీకు లేవని ఎన్నికలు ఏ విధంగా జరిగాయో ప్రజలంతా చూశారన్నారు. సుపరిపాలన గురించి ప్రజలు జై కొట్టలేదని చీకొడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శివ కళ్యాణ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచేవారు అన్నారు. పబ్బం గడుపుకునే మాటలు మానేయాలని ఖాదర్ హితవు పలికారు.

# విజయపథంలో డాక్టర్ విద్యాసాగర్ ఆసుపత్రి

**500 రోబోటిక్ మోకాళ్ల మార్పిడి సర్జరీలు పూర్తి - మోకాళ్ళ నొప్పి నుంచి విముక్తి పొందామన్న వృద్ధులు**




**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్ రాయలసీమలో ఆధునిక జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీలకు కేంద్ర బిందువుగా మారింది. విజయవంతంగాగా 500 రోబోటిక్ మోకాళ్ళ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తిచేసుకొని 500 జీవితాలలో మార్పు తెచ్చింది.కదలికలను పునరుద్ధరించడం,తద్వారా ఆత్మవిశ్వాసాన్ని తిరిగి అందించడంలో ప్రజల విశ్వాసాన్ని పొంది.. విజయపథం లో దూసుకుపోతున్న ప్రజా హాస్పిటల్ విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్. బోన్ ,జాయింట్ కేర్‌లో తన అద్భుతమైన ప్రయాణంలో మరొక పెద్ద మైలురాయిని విద్యాసాగర్ ఆసుపత్రి, కడప అధిగమించింది . 500 రోబోటిక్ మోకాళ్ల శస్త్రచికిత్సలను విజయ వంతంగా పూర్తి చేసిన ఘనతను కేక్ కటింగ్‌తో, అలాగే నొప్పి నుండి నూతన జీవితం వరకు ప్రయాణించిన అనేక మంది రోగుల చిరునవ్వులతో , శ్రేయో భిలాషుల ఆశీస్సులతో ఆదివారం ఆనందంగా జరుపుకుంది. విద్యాసాగర్ హాస్పిటల్ గత 15 సంవత్సరాలుగా ఎముకలు, కీళ్ల సంరక్షణలో విశేష సేవలందిస్తూ 7500 లకు పైగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. రాయలసీమలో జాయింట్ కేర్ కోసం ప్రపంచస్థాయి సీఓఆర్ఐ రోబోటిక్ సాంకేతికతను పరిచయం చేసిన మొదటి ఆసుపత్రిగా విద్యాసాగర్ హాస్పిటల్ పేరుగాంచింది. పాక్షిక, సంపూర్ణ మోకాళ్ల మార్పిడి శస్త్రచిత్సలతో పాటు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తోంది.డాక్టర్ విద్యాసాగర్ అద్భుతమైన శస్త్రచికిత్స నైపుణ్యానికి తోడు రోబోటిక్ టెక్నాలజీ అనుసంధానం ద్వారా అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల వేదికలలో పాల్గొనడంతోపాటు అక్కడ ఆయన ప్రసంగాలువిశేషంగా ప్రశంసించ బడ్డాయి. ఈ సందర్భంగా విద్యాసాగర్ ఆసుపత్రి చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ 500 రోబోటిక్ మోకాళ్ల శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకోవడం మా బృందం అంకితభావానికి, ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. రోబోటిక్ సాంకేతికతో 100 శాతం ఖచ్చితత్వం తో రోగి శరీర నిర్మాణానికి సరిపడే ఇంప్లాంట్లను అమర్చడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ కార్యక్రమమే లో రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగాలతోపాటు మోకీళ్ల కీళ్ల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.టైర్ 2 నగరమైన కడప లాంటి ప్రాంతాలలో రోగులు విభిన్నమోకీళ్ల అరుగుదల సమస్యలతో వస్తారు. వీరిలో అనేక మంది ఊబకాయం, బీపీ, షుగర్, హృద్రోగాలు, పూర్వ శస్త్రచికిత్సల సమస్యలతో బాధపడుతున్నారు. రైతులు, గృహిణులు, కూలీలు, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, మార్కెటింగ్ నిపుణులు వంటి వివిధ వృత్తుల వ్యక్తులలో ఈ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. రోబోటిక్ మోకాళ్ల రీప్లేస్‌మెంట్ సహాయంతో గత రెండు సంవత్సరాల్లో వందలాది రోగులు 100 శాతం సంతృప్తితో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపు తున్నారు. రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారు మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సను తమకు పునర్జన్మగా భావిస్తున్నామన్నారు . మోకాళ్ల నొప్పి నుంచి పూర్తిగా విముక్తి పొంది , సాధారణ జీవితాన్ని తిరిగి ఆస్వాది స్తున్నామన్నారు.డాక్టర్ తో పాటు ప్రముఖ డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీ లక్ష్మి సేవలు మరువలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు నాగముని రెడ్డి,చిన్నపరెడ్డి, డా.రంగనాథ రెడ్డి, సైకాలజిస్ట్ ఓ.వి. రెడ్డి, సర్జరీలు చేయించుకున్న వారు,విద్యాసాగర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

# మెగా డిఎస్సి అమలు హర్షణీయం

**- డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి**



**వేంపల్లె, మేజర్‌న్యూస్ :** 15 నెలలు ఆలస్యమైన కూటమి ప్రభుత్వం తొలి సంతకమైన 16,347 టీచర్ పోస్టులకు సంబంధించి మెగా డిఎస్సీని అమలు చేయడం హర్షణీయమని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ లోని మిగిలిన హామీల మాటేమిటి అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. వీటిని వెంటనే అమలు చేయాలని, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు

**వేంపల్లె మేజర్‌న్యూస్ :** జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అనిల్, తేజేంద్ర లు పేర్కొన్నారు. స్థానిక శ్లోకా పాఠశాలలో సోమవారం ఉదయం 9 నుంచి ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. 8-45 ఏళ్ల మధ్య ఆయా విభాగాల్లో యోగా పోటీలు ఉంటాయని, పోటీల్లో ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరింత సమాచారం కోసం 6301612190, 9440470064 నెంబర్ లను సంప్రదించాలని కోరారు. సెప్టెంబర్ 6,7 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా, ద్వారక తిరుమలలో 50వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరగనున్నాయి.

# వై వి.యూ.పరిశోధక విద్యార్థికి డీఎస్సీ ఫలితాల్లో ఒకేసారి 3 ఉద్యోగాలు

**అభినందించిన వర్సిటీ అధికారులు**



**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి గంధం అశోక్ కుమార్ మెగా డీఎస్సీ..లో మూడు ఉద్యోగాలతో సత్తా చాటాడు. అనంతపురం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 2వ ర్యాంక్, పీజీటీ జోన్ - 4లో 9వ ర్యాంక్, టీజీటీ జోన్ - 4లో 33వ ర్యాంక్ సాధించాడు. ఈయన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) - జెఆర్ఎఫ్ లో కూడా రాణించారు. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అశోక్‌కుమార్‌ను వర్సిటీ అధికారులు,విద్యార్థులు అభినందించారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలి



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా వినాయక చవితి పండుగను ,నిమజ్జనాన్ని జరుపుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీలకు బ్రహ్మంగారిమఠం ఎస్సై శివప్రసాద్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ వినాయక చవితి పర్వదినా పురస్కరించుకొని . మండలంలో పందిళ్లు మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించేవారుముందస్తు పోలీసు అనుమతి పొంది ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. శాంతి భద్రత లకు భంగం కలిగించకుండా, అలాగే పండుగను కుల మతాలక తీతంగా శాంతిభద్రతల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన కోరారు. వినాయక విగ్రహాలు పెట్టడానికి ఎలాంటి రుసుములు చెల్లించవలసిన అవసరం లేదు. విగ్రహాల అనుమతికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటన్న, పోలీసులు ఓబులయ్య, రమణ, యానాద్ రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి , నాగేశ్వర్ రెడ్డి , హోంగార్డ్ లు బాలయ్య, నాగరాజు ఉన్నారు. టిడిపి ఉపాధ్యక్షులు నరసింహ గౌడ్, బోలా శీను, నారాయణ, చలపతి ఉన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కొత్త మోటార్లు ఏర్పాటు చేసిన సర్పంచ్**



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** స్థానిక గ్రామ పంచాయతీ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం పాపాగ్నీ నదిలో కొత్త మోటార్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి, మోటార్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి ఆది, పుల్లయ్యతోట నగేష్, వార్డు సభ్యుడు సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలో నడి బొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంల్లో భాగంగా ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృ తాభిషేకం సహస్రనామార్చన కుంకుమార్చన తదితర పూజా కైకర్యాలు అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ, అంకాలమ్మ తల్లికి ప్రతి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, వాటిలో భాగంగా ఆదివారాన్ని పురస్కరించుకొని అంకాలమ్మ తల్లికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలియ జేశారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు

# నేడు సొసైటీ చైర్మన్,డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

**ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహా రెడ్డి.**

**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతనంగా ఎన్నికైన చైర్మన్ మరియు డైరెక్టర్లు సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలకు సొసైటీ బ్యాంక్ వద్ద ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి , టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహా రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ టి. వి.కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే కార్పొరేషన్ పరిధిలోని ప్రతినిధులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం నాయకులు సభా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# చింతకొమ్మదిన్నె పరపతి సంఘం చైర్మన్‌గా ఇల్లూరు శంకర్ రెడ్డి నియామకం



**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన ఇల్లూరు శంకర్ రెడ్డిని చింతకొమ్మదిన్నె రైతు సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదల య్యాయి. శంకర్ రెడ్డి గత 25 సంవత్స రాలుగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందించారు. రైతు కుటుంబంలో జన్మించి, రైతుల సమస్యలను సన్నిహితంగా అనుభవించిన ఆయనకు ఈ పదవి లభించడం సహజమేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ, "నాకు ఈ బాధ్యత లభించేందుకు సహకరించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డికి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పార్టీలో కృషిచేసిన వారికి ప్రాధాన్యత ఇచ్చే విధానానికి ఇది ఒక ఉదాహరణ" అని పేర్కొన్నారు.

## హెూటల్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని ద్వారకా ఫ్యామిలీ రెస్టారెంట్ లో ఆదివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ద్వారక ఫ్యామిలీ రెస్టారెంట్ నందు వంటగదిని పరిశీలించారు. అక్కడ కలిగి ఉన్న పరిశుభ్రతను ,నాణ్యతలను ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తనిఖీలు నిర్వందించడం జరిగింది. అక్కడ సిద్దం చేసిన వంటలు కు వెజిటబుల్ ఫ్రైడ్ రైస్,పన్నీర్,చిల్లీ, మష్రూమ్,హ రోస్ట్, చిల్లీ చికెన్, పెప్పర్ చికెన్ వంటి ఆహార పదార్ధములు శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కుళ పంపుతున్నట్టు వెల్లడించారు. రెస్టారెంట్ లో పరిశుభ్రత విషయంలో వారికి నోటీసులు జారీ చేశారు. రెస్టారెంట్ నిర్వాహకులు కచ్చితంగా ఫుడ్ సేఫ్టీ నియమ నిబంధనలు, ఆహార నాణ్యతలు పాటించాల్సిందేన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి ఎం. హరిత, వారి సిబ్బంది పాల్గొన్నారు .

## కేసీ కెనాల్ పడి యువకుడు గల్లంతు



ఫైల్ ఫోటో

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** దువ్వూరు మండలపరదిలోని జిల్లేల్ల గ్రామ సమీపంలో కేసికెనాల్ లో పడి యువకుడు గల్లంతయ్యాడు. నాదెండ్ల షెఫిక్ తండ్రి మహమ్మద్ 10వ తరగతి చదువుతున్న బాలుడు ఉదయం మోటర్ సైకిల్ ను సుబ్రం చేసుకొనుటకు బకెట్ తీసుకుని వెళ్ళి, మోటార్ సైకిల్ శుభ్రం చేసిన అనంతరం ఈతకు దిగాడు కేసీ కెనాల్ లో ఈతకోడుతూ గల్లంతయ్యారని స్థానికులు తేలిపారు. కేసికెనాల్ వెంట తల్లి తండ్రులు, స్థానిక ప్రజలు, ఆధికారులు వెతకటకం మొదలుపెట్టారు. సాయం కాలంవరకు వెతికినప్పటికి బాలుని ఆచూకి లబించలేదు.

## బ్రాహ్మణ సమస్యలను పరిష్కరించండి



**కడప మేజర్‌న్యూస్ :** బ్రాహ్మణ కుటుంబాల లో పేద బ్రాహ్మణులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ న్నారు అని వాటి పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని బ్రాహ్మణ సమ్మేళనం లో నాయకులు డిమాండ్ చేశారు. కడపలోని శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం ఆవరణలో జరిగిన బ్రాహ్మణ సమ్మేళనం కు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు సూగురు రఘునాథ రావు అధ్యక్షతన జరిగిన సమావేశం లో ముఖ్య అతిథులు గా పిడతల గోపాల కృష్ణ చంద్రమౌళి శర్మ. చిత్రపు హనుమంతరావు తిరుపతి అనంతకుమారి అనంతపురం సుబ్బారావు నంద్యాల నరేష్ అన్నమయ్య లక్ష్మి దేవి కడప చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ పీ వి ఎస్ వి ప్రసాదరావు పాల్గొన్నారు. బ్రాహ్మణ సమ్మేళనం లో పాల్గొన్న బ్రాహ్మణ ల ఉ ద్దేశించి. మాట్లాడు తు బ్రాహ్మణ కుటుంబాలలో అనేక మందికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సహాయం అందలేదని అటువంటి వారు సమస్య వివరాలు ను తమ దృష్టికి తేవాలనికోరారు. ఇంటి స్థలాలు లేక స్వంత ఇల్లు లేని వారు పూర్తి వివరాలు ఇస్తే అధికారులు దృష్టి కి తీసుకు పోతామని అన్నారు. రాజకీయాలు లో బ్రాహ్మణులకు గుర్తింపు ఇవ్వాలని పార్టీ పదవులలో అవకాశం ఇవ్వాలని కోరారు. అర్చక సంఘం నాయకులు పిడతల గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్చకులు ఎదుర్కొంటున్న సమస్య లను సభ దృష్టికి తెచ్చారు. చంద్రమౌళి శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు సంఘ టీతం గా ఉంటేనే బలం ఉంటుందని ఐకమత్యం కోసం ఆరాటపడుతున్నానని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన రఘునాథరావు మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీ సీనియర్ నాయకులు ను గుర్తించి తగు అవకాశాలు ఇవ్వాలని కోరారు. క్రెడిట్ సొసైటీ మేనేజర్ సొసైటీ పథకాలు గురించి వివరించారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ లకు గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలనీ కోరారు. పార్టీ పదవులు లో నామినేటెడ్ పదవులు లో బ్రాహ్మణులు కు అవకాశం ఇవ్వాలని కోరారు. ధూప దీప నైవేద్యం కింద దరఖాస్తు చేసుకున్న దేవాలయం లకు నిధులు మంజూరు చేయాలనీ కోరారు. అనంతరం నిర్వాహకులను బ్రాహ్మణులు సత్కరించారు. కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ సురేష్ మాజీ డైరెక్టర్ ప్రసాదరావు లాయర్ సురేష్ .సాయి. శ్రీధరావు. తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సమీక్ష సమావేశం

ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలి.. - నిమజ్జనం రోజు అశ్లీల ప్రదర్శనలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..
- మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్త తీసుకోవాలి.. - బద్వేల్ రూరల్ సీఐ కృష్ణయ్య..




**బద్వేల్ (గోపవరం)మేజర్‌న్యూస్ :** బద్వేల్ రూరల్ పరిధిలోని గ్రామస్తులు వినాయక చవితి ఉత్సవాలను సామరస్యంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ కిష్టయ్య ఉత్సవ కమిటీ సభ్యులకు పీస్ కమిటీ సభ్యులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్లో పరిధిలోని గ్రామాలలో రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక ప్రతిమలు మరియు నిమజ్జనం కార్యక్రమాలను ప్రజలు శాంతియుతంగా ఆనందోత్సాహాలతో నడుమ బద్వేల్ మరియు గోపవరం గ్రామాల పరిధిలోని ప్రజలందరూ జరుపుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులను పీస్ కమిటీ సభ్యులను ఆయన కోరారు. వినాయక చవితి పండుగను కులమతాలకు అతీతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్సవాలను ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని ఆయన కోరారు అదేవిధంగా స్వామివారి నిమజ్జనం రోజు విగ్రహాల వెంబడి అశ్లీల నృత్యాలు అదేవిధంగా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించరాదని అలా నిర్వహించిన యెడల ఉత్సవ కమిటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా ఉత్సవాల నిర్వహించే కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరు పోలీస్ అధికారులచే తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు . అనుమతులు పొందకుండా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేయరాదని అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.సమావేశంలో రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ క్రిష్ణయ్య మరియు బద్వేల్ రూరల్ ఎస్ ఐ శ్రీకాంత్ బద్వేల్ రూరల్ పరిధి లో ఉన్నటువంటి పీస్ కమిటీ సభ్యులతో బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఈరోజు ఉదయం సమావేశం ఏర్పాటు చేశారు సమావేశంలో పీస్ కమిటీ లోని సభ్యులు కూడా పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారి వారి సలహాలను తెలిపినారు.

## వినాయక చవితిని శాంతి యుతంగా నిర్వహించుకోవాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** వినాయక చవితిని శాంతి యుతంగా నిర్వహించుకోవాలని రూరల్ సిఐ బాలమద్దిలేటి తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరు రూరల్ పిఎస్ పరిధిలోని శంకరాపురం గ్రామంలో ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు సైబర్ నేరాలు, ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్ధాలు, రాబోయే వినాయక చవితి పండుగ గురించి కొన్ని జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెంచరీ ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ

విజిలన్స్ అడిషనల్ ఏ స్ పి :శ్రీనివాస రావ్



**బద్వేల్ (గోపవరం) మేజర్‌న్యూస్ :** గోపవరం మండలం పిపి కుంట సమీపంలో ఉన్న సెంచిరి ప్లై వుడ్ కంపెనీ ఆకస్మికంగా ఆదివారం విజిలన్స్ అడిషనల్ స్ పి శ్రీనివాస రావు తనిఖీ చేశారు. సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీలో ఎరువులు ఎక్కువ శాతం నిలువ చేశారని ఫిర్యాదులు రావడంతో ఆయన సెంచరీ ఫ్యాక్టరీలోని పలు ప్రదేశాలను తనిఖీ చేశారు.ప్రస్తుత సీజన్ ఖరీఫ్ లొ యూరియా కొరత బలంగా విస్తరించ్చిందని విజిలన్స్ అధికారులు అక్మికంగా తనికీలు చేయడం జరుగుతుంది అందులో భాగంగా గోపవరం మండలం పిపి కుంట దగ్గర ఉన్న సెంచిరీ పానల్ కంపెనీ ని తనిఖీ చేసారు అక్కడ యూరియా డంప్ అవుతుంది అని సమాచారం తో అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ ఉన్న యూరియా టెక్నికల్ గ్రేడ్ యూరియా అని నిర్ధారణ అయినది ఈ యూరియా కేవలం ఇండస్ట్రియల్ పర్పస్ కోసం వాడుతున్నారని అధికారులు నిర్ణయం తీసుకొన్నారు ఈ కార్యక్రమం లొ రూరల్ సిఐ కృష్ణయ్య విజిలెన్స్ సిఐ శివన్న మండల వ్యవసాయ అధికారి విజయరావ్, గోపవరం యస్ ఐ శ్రీకాంత్ వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ ఉద్యోగులకు పిఆర్సి ప్రకటించాలి

ఏపీటీఎఫ్ డిమాండ్




**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల ఏపీటీఎఫ్ రీజియన్ కార్యాలయం నందు ఆదివారం కార్యవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ద్వారా పాత పెన్షన్ అమలు చెయ్యాలని చెప్పడం జరిగింది అన్నారు. ఉద్యోగులకు పి ఆర్ సి, ఐ ఆర్ 30%, రావాల్సిన కరువు భత్యం డి ఏ లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన మూల్యాంకన పుస్తక విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులను భోదనేతర కార్యక్రమములకు వాడుకోరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్రనాధ్ రెడ్డి రామకృష్ణారెడ్డి ,గాంధీ, సుబ్బయ్య, అన్వర్ భాష.భూపాల్ రెడ్డి,జగన్ రెడ్డి, రామమోహనరెడ్డి లు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోండి ఎస్సై తిమోతి

**కలసపాడు మేజర్‌న్యూస్ :** మండలంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని స్థానిక కలసపాడు పోలీస్ స్టేషన్లో ఎస్సై తిమోతి శాంతి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయ ప్రతిమలు మరియు నిమజ్జనం లను శాంతియుతంగా ఆనందోత్సాహాలతో కలసపాడు మండలంలోని 13 గ్రామ పంచాయతీల లో ప్రజలందరూ జరుపుకోవాలని ఉద్దేశంతో కలసపాడు పోలీస్స్టేషన్లో ఆదివారం మండలంలోని పీస్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు సమావేశంలో పీస్ కమిటీలోని సభ్యులు కూడా పండుగ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారి వారి సలహాలను తెలియజేశారు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలసపాడు ఎస్ఐ తిమోతి తెలియజేశారు



# ఆరోగ్యమే.. మహాభాగ్యం

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నగర శివార్లలోని ఊటుకూరు సర్కిల్ నుండి మౌంట్ ఫోర్ట్ స్కూల్ వరకూ 6 కి.మీ నిర్వహించిన సైకిల్ ర్యాలీ ని జిల్లా ఎస్.పి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బంది లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమని ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ ను అలవాటుగా చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా మహాభాగ్యమని తెలిపారు, శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు, సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు రోజు లో ఒక్కసారైనా క్రమం తప్పకుండ సైక్లింగ్ చేయడం వల్ల క్యాలరీలు ఖర్చయి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సైక్లింగ్ సహాయపడుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది తో పాటు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొద్ది సమయాన్ని శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించినపుడే కుటుంబం సంతోషంగా ఉంటుందని, పోలీస్ సిబ్బంది



తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు,ఆధునిక జీవన శైలి లో వాహనాలలో ప్రయాణించడం అందరికి అలవాటుగా మారిందని, సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మన ఆరోగ్యం బాగుంటుందన్నారు, ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాసరావు స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, సి.కె దిన్నె సి.ఐ నాగభూషణ్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆర్.ఐ లు శివరాముడు, టైటస్, వీరేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ డి.కె జావీద్,చిన్న చౌకు సి.ఐ ఓబులేసు, చెన్నూరు సి.ఐ కృష్ణారెడ్డి, కడప టూ టౌన్ సి.ఐ సుబ్బారావు, సి.కె దిన్నె ఎస్.ఐ శ్రీనివాసుల రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,

# చింతకొమ్మదిన్నెలో నూతన స్మార్ట్ కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్



**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కడప జిల్లా, చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూల్ ఆవరణలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం పరిశీలించారు. సెప్టెంబర్ 2న జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేత ప్రారంభించేందుకు సన్నాహకంగా ఈ స్మార్ట్ కిచెన్ షెడ్ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి సమీక్షించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఆటోమేటెడ్ వంటశాలలో వంట సామాగ్రి, మౌలిక వసతులు, గ్యాస్ మరియు ఇతర అవసరాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులనుండి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యే మంత్రికి తోడుగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, ప్రజలు రావాల్సిన నేపథ్యంలో, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో జిల్లా ఎస్పీతో కలసి భద్రతా చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఏ, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నిర్మానుష ప్రాంతాలలో పోలీసు నిఘా

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** కడప జిల్లాను గంజాయి రహిత జిల్లా గా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవించే, విక్రయించే అవకాశమున్న నిర్మానుష ప్రాంతాలు, ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వ్యక్తుల పై ఆరా తీశారు. కిరాణా షాపులు, గోడౌన్ లు, పాడుబడ్డ క్వార్టర్ లు, భవనాలలో గంజాయి సేవించే, విక్రయించే వారి కోసం సిబ్బందితో అణువణువూ గాలించారు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు క్షుణ్ణంగా విచారిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి రవాణా,



వినియోగం, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ హెచ్చరించారు. ప్రజలు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఇవ్వాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

# శుద్ధి.. పచ్చి అబద్ధం

### మినరల్ నీటి పేరుతో ఇష్టారాజ్యంగా విక్రయం - కడప నగరంలో విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు - కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి అత్యంత కీలకం, కడప నగరంలో చాలామంది శుద్ధి జలాల పేరుతో ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేసి తాగుతున్నారు, నిబంధనలు పాటించకుండా పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న శుద్ధి నీటి కేంద్రాల నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంత సురక్షితం అనేది చర్చనీయాంసంగా మారింది , పర్యవేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి నీటిని క్యాన్ లలో నింపేసి అమ్మేసుకుంటూ డబ్బులు సంపాదిస్తున్నారు, ఆ నీటిని కడప నగరంలో లక్షల మంది వినియోగిస్తున్నారు, చాలా కేంద్రాలలో నిబంధనలు పాటించడం లేదు, బోరు నీటిని ఆర్వో ప్లాంట్లలో నుంచి క్యాన్ లో నింపేసి అమ్మేసుకుంటూ ప్రజల నుండి డబ్బులు దోచేస్తున్నారు, కడప నగరంలో ఇలాంటివి సందు సందుల్లో అయిదారు వాటర్ ప్లాంట్లను నెలకొల్పారు మొత్తంగా చూసుకుంటే నగరంలో వేళల్లో వాటర్ ప్లాంట్ లు ఉన్నాయి, మురుగు కాలువల పక్కన బోర్లు వేసి ఆ కలుషితమైన నీటిని శుద్ధి చేయకుండా ప్రజలను మభ్యపెట్టి వారికి అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు, 20 లీటర్ల క్యాన్ 25 రూపాయల దాకా వసూలు చేసుకుంటున్నారు, ఇళ్ల వద్ద జరిగే చిన్న చిన్న శుభకార్యాలకు అధిక ధరలు వసూలు చేస్తూ వారికి కలుస్తమైన నీటిని సరఫరా చేస్తున్నారు,

#### శుభ్రత నాణ్యత ప్రమాణాలే లేవు

ప్రతి క్యాను పై లేబుల్ విధిగా ఉంచి నీటి శుద్ధి ప్రమాణాలు లేకుండా వాటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు, ప్లాస్టిక్ క్యాన్లను కూడా ప్రమాణాల మేరకు ఉన్నవాటిని వినియోగించుకోకుండా నాచరికం ప్లాస్టిక్ క్యాన్లను వాడటం వల్ల ప్రజలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి, నీటిలో శరీరానికి ఆరోగ్యానికి ఉపయోగపడే ఖనిజాలు ఉంటాయి ఆర్వో ప్లాంట్లలో శుద్ధి ప్రక్రియలో పూర్తిగా కనిజాలు తొలగిపోతాయి వీటివల్ల ప్రజలకు ఎముకల సాంద్రత తగ్గిపోతూ బలహీనులు మారుతున్నారు, ప్రస్తుతం ఈ నీరు ఉపయోగిస్తున్న ప్రజలు దాదాపు 70 శాతం మంది మోకాళ్ళ నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు, మోకాలు తీవ్రంగా అరుగుదల ఏర్పడటం వల్ల చిస్ర చికిత్సలు చేయించుకునేందుకు లక్షల రూపాయలు ధరపోస్తున్నారు,



#### ఈ నిబంధనలు ఉండాల్సిందే

బోరు నీరు కోసం భూగర్భ జనురుల శాఖ అనుమతి చిన్న తరహా పరిశ్రమ కోసం పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి, నీటి నాణ్యతను పరీక్షిం చేందుకు ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలి, ప్రతి వాటర్ ప్లాంట్ లో మైక్రో బయాల జిస్ట్, కెమిస్ట్రీ ఉండాలి, పనిచేసే సిబ్బంది కూడా ఆరోగ్యవంతులై ఉండాలి, నిర్దేశించిన పరిమాణంలో ఖనిజాలను కలిపేందుకు ప్రత్యేకంగా అవగాహన కలిగి ఉండాలి,

#### అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం

నగరంలో పుట్టగొడుగుల వేళల్లో ఏర్పాటుచేసిన నీటి శుద్ధి కేంద్రాలు పై సంబంధిత అధికారులు నిఘా కొరవడంతో విచ్చలవిడిగా శుద్ధి పేరుతో నీరు అమ్ముకుంటూ ప్రభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించకుండా ప్రజల వద్ద నుండి లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్న వాటర్ ప్లాంట్ యజమానులు కనీసం నీటిని శుద్ధి చేసే అవగాహన కూడా ఉండడం లేదు, మరి విచిత్రం ఏమిటంటే నిత్యం జిల్లా అధికారులు తిరిగే రోడ్డుపైనే పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసి నీటిని అమ్ముకుంటున్న అధికారులు అటువైపు తొంగిచూసే నాధుడే కరువయ్యారు, ప్రజలేమో ఆర్వో ప్లాంట్ యజమానుల నమ్మకంతో ఆ నీటిని తీసుకెళ్లి తాగుతూ అనారోగ్య పాలవుతున్నారు, ఇప్పటికైనా జిల్లా సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్ల పైన ఆకస్మిక తనిఖీలు చేపట్టి ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు,

# సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామము

### శారీరక దృఢత్వం సంపూర్ణ ఆరోగ్యం

### - పులివెందుల డిఎస్పి మురళి నాయక్



**పులివెందుల మేజర్‌న్యూస్ :** శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని పులివెందుల డిఎస్పి మురళి పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లో ఉదయం 6.30 గంటలకు సైక్లింగ్ కార్యక్రమాన్ని పులివెందుల సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బి. మురళి నాయక్, పులివెందుల రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట రమణ, పులివెందుల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజీవలి , పులివెందుల టౌన్ ఎస్సై, నారాయన మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని స్థానిక పులివెందుల టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నుండి ఓల్డ్ ఆర్టీసి బస్టాండ్ వరకు సైక్లింగ్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డిఎస్పి మురళి నాయక్ మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమని ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ ను అలవాటుగా చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా మహాభాగ్యమని తెలిపారు, శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు, సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు రోజు లో ఒక్కసారైనా క్రమం తప్పకుండ సైక్లింగ్ చేయడం వల్ల క్యాలరీలు ఖర్చయి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సైక్లింగ్ సహాయపడుతుందని తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించినపుడే కుటుంబం సంతోషంగా ఉంటుందని, పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు, ఆధునిక జీవన శైలి లో వాహనాలలో ప్రయాణించడం అందరికి అలవాటుగా మారిందని, సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మన ఆరోగ్యం బాగుంటుందన్నారు, ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, తాత్విక చింతన అలవర్చుకోవాలి

## పుస్తకావిష్కరణ సభలో డా. వల్లూరు బ్రహ్మయ్య

**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** ఆధ్యాత్మిక అంశాలు, తాత్విక చింతన అందరూ అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, అప్పుడే దేశం బాగుంటుందని ఒంటిమిట్ట మండల విద్యాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. కొత్తపల్లె రామాంజనేయులు రచించిన 'ఉదయ సింధూరం' పుస్తకావిష్కరణ సభ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ రామాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ రచయిత పెద్దకొత్తపల్లె గ్రామానికి చెందిన వాడు కనుక చిన్నతనం నుంచే ఒంటిమిట్ట కోదండ రామాలయంతో అనుబంధం ఉందన్నారు. అందుకే పుస్తకంలో ఆయన ఆలయ ప్రత్యేకతల గురించి వివరించారన్నారు. శైవ, వైష్ణవ అబేధం గురించి చెప్పడం ముదావహమన్నారు. ఒంటిమిట్ట చెరువు, బౌద్ధారామాలు ఇలా పలు అంశాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. ఒక వ్యక్తిపై బాల్యం ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. కైఫీయత్తులను కూడా ఇందులో ఉదహరించారన్నారు. ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతి వంటి విషయాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. అందరి వద్ద అందుబాటులో ఉండాల్సిన పుస్తకమని కొనియాడారు. సీపీబ్రౌన్ గ్రంథాలయానికి పాఠకునిగా వచ్చిన రామాంజనేయులు రచయితగా మారారంటూ ప్రశంసించారు. అధ్యక్షత వహించిన రామకృష్ణ మిషన్ ప్రతినిధి శారద ప్రసన్న మాట్లాడుతూ చారిత్రక, ఆధ్యాత్మిక అంశాల సమాహారమే 'ఉదయ సింధూరం' పుస్తకమని తెలిపారు. బాపిరాజు, నోరి నరసింహాశాస్త్రి శైలి ఇందులో కనబడుతుందన్నారు. ప్రతి కవికి ఒక భూమికి ఉంటుందని, పుట్టి పెరిగిన ప్రాంత ప్రభావం రచనల్లో ఉంటాయన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ సీపీ బ్రౌన్ గ్రంథాలయ లక్ష్యాన్ని



రామాంజనేయులు లాంటి వ్యక్తుల ద్వారా నెరవేరినందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తులు, ప్రదేశాలు వంటి పలు అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు చూడకుండా పుస్తకాలు చదివే అలవాటును పెంచాలన్నారు.జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్య ప్రక్రియలోని వ్యాస ప్రక్రియను రచయిత ఎంచుకున్నారని తెలిపారు. 1950-60 నాటి రాజకీయ పరిస్థితులు ఇందులో అగుపిస్తాయన్నారు.జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పుస్తక సమీక్ష చేశారు. ఇంతకుమునుపే సొద్దకంకి పేరుతో రామాంజనేయులు కథా సంపుటిని వెలువరించారని పేర్కొన్నారు. ఆయన మాండలికంతో పుస్తకాన్ని రూపొందించారన్నారు. మనకు తెలియని కొత్త విషయాలు పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. రామాలయం ధర్మకర్త దేసు వెంకటరెడ్డి మాట్లాడుతూ రచయిత కలం నుంచి భవిష్యత్తులో మరిన్ని మంచి పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వి. సాయిప్రసాద్, శ్యామ సుందర రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, జానమద్ది విజయభాస్కర్, పాల్గొన్నారు. అనంతరం రచయిత కొత్తపల్లె రామాంజనేయులును పలువురు ఘనంగా సత్కరించారు.

# బంధుమిత్రుల ఆశీర్వాదాలతో ఘనంగా వివాహా వేడుకలు



**కలసపాడు: మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలం లోని సింగారాయపల్లె గ్రామము నందు ఓసూరి వారి వివాహా కార్య క్రమంలో ఆదివారం కలసపాడు ఆర్.సీ.ఎం.చర్చి విచారణ గురువు రెవ రెండ్ ఫాదర్ కొత్తపల్లె జోసఫ్ మనోహర్ ఆద్వర్యంలో సింగరాయపల్లె గ్రామం లోని నిత్య సహాయ మాతా చర్చి లోవివాహకార్య క్రమం ఓసూరి విలియం ,మరియమ్మ ప్రధమ పుత్రుడు కిరణ్ కుమార్ కు పుల్లారెడ్డిపల్లె గ్రామ వాస్తవ్యులు కత్తి తిమోతి, చిన్నక్క కుమార్తే శిల్పా, వివాహ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమంలో విచారణ గురువులు. కొత్తపల్లి మనోహర్ బద్వేల్ విచారణ గురువులు రేవ, ఫా. లక్కినేని ఆరోగ్యరాజ్ బంగారుపాలె విచారణ గురువులు , రెవ, పా. ఓసూరి జోసెఫ్,గిద్దలూరు విచారణ గురువులు రేవ .ఫా. కదిరెపోగు జయన్నలతో స్నేహితులు బంధుమిత్రులు పలువురు నాయకులు కార్యకర్తలు యువత అభిమానులు పాల్గొన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొని వివాహా కార్యక్రమం నందు పాల్గొన్న వారికి సహాభంతి బోజన ఏర్పాట్లు చేశారు. వివాహానికి హాజరైన బంధువులు స్నేహితులు పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తె ల బంధువులు, స్నేహితులు అందరూపాల్గొనివధూవరులను ఆశీర్వదించారు.

# చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహనా

## సూపర్వైజర్లు,వై సుబ్బమ్మ, పి విజయ కుమారి




**కమలాపురం మేజర్‌న్యూస్ :** బాలలకు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు కాల్ చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు వై సుబ్బమ్మ పి విజయ కుమారి అన్నారు. కమలాపురం ప్రాజెక్ట్ మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్ లైన్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్ద చెప్పలి జిల్లా పరిషత్ హై స్కూల్ లో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్లు, పి విజయ్ కుమారి వై సుబ్బమ్మ మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ పై ప్రతి ఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలని బిక్షాటన చేసే పిల్లలు కనిపించినా,బాల్య వివాహంలు జరిగినా 1098కి సమాచారం ఇవ్వాలని,1098కి ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయాని తెలిపారు.పిల్లలు ఏ పని చేసినప్పటికీ ఆలోచించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్త పడాలని సత్ప్రవర్తనతో మెలగాలని అప్పుడే వారు అనుకున్నటువంటి గమ్యాన్ని చేరుకోగలరని తెలిపారు.18 సంవత్సరాలలోపు ఉన్నటువంటి పిల్లలందరూ ఈ చట్టం పరిధిలోకి వస్తారని,18 సంవత్సరాలలోపు ఉన్నటువంటి పిల్లలు అనేక రకాల సమస్యలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అటువంటి వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందిస్తున్న టువంటి సేవలను వివరించడంతోపాటు సమాజంలో జరుగుతున్నటువంటి ప్రతి విషయాలపైన అవగాహన పెంపొందించు కోవాలని అనాలోచిత తొందరపాటు నిర్ణయాలతో చక్కటి భవిష్యత్తును కోల్పోకూడదని, మంచి చెడులను గ్రహిస్తూ అవగాహనతో నడుచుకున్నప్పుడే వారి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన వారు అవుతారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగము సిబ్బంది వై విజయ కుమారి, లక్ష్మీ ప్రసన్న, గ్రామసచివాలయ మహిళా పోలీస్,,అధ్యాపకులు, పాల్గొన్నారు

# వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని భౌతిక శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. సహదేవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థినులు వర్షాకాలంలో నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ప్రజలకు ఈ వ్యాధుల పట్ల, పారిశుద్ధ్యము, పరిశుభ్రత గురించి తెలియజేయాలని తెలిపారు. ఈ సందర్భముగా కళాశాల స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ నీటి ద్వారా సంక్రమించే వ్యాధులైన కలరా, డయేరియా మొదలైన వ్యాధులు ఎలా సంక్రమిస్తాయి వాటిని ఎలా నివారించాలని తెలిపారు. అన్ని అంటు వ్యాధులలో 17% కంటే ఎక్కువ వెక్టర్-బోర్న్ వ్యాధులు కారణమవుతాయని, దీని వలన ఏటా 700 000 కంటే ఎక్కువ మరణాలు సంభవిస్తాయని. అవి పరాన్నజీవులు, బ్యాక్టీరియా లేదా వైరస్‌ల వల్ల సంభవిస్థాయిని తెలిపారు.మలేరియా అనేది అనోఫెలిన్ దోమల ద్వారా సంక్రమించే పరాన్నజీవి సంక్రమణ . ఇది ప్రపంచవ్యాప్తంగా 249 మిలియన్ల కేసులకు కారణమవుతుందని మరియు ప్రతి సంవత్సరం 608,000 కంటే ఎక్కువ మరణాలకు కారణమవుతుందని అంచనా. ఎక్కువ మరణాలు 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో



సంభవిస్తాయని తెలిపారు.డెంగ్యూ అనేది ఏడిస్ దోమల ద్వారా సంక్రమించే అత్యంత ప్రబలమైన వైరల్ ఇన్ఫెక్షన్ . 132 దేశాలలో 3.9 బిలియన్లకు పైగా ప్రజలు డెంగ్యూ బారిన పడే ప్రమాదం ఉందనీ ప్రతి సంవత్సరం 96 మిలియన్ల లక్షణాల కేసులు మరియు 40,000 మరణాలు సంభవిస్తున్నాయని అంచనా.వైరస్ వాహకాల ద్వారా సంక్రమించే ఇతర వైరల్ వ్యాధులు చికున్‌గున్యా జ్వరం, జికా వైరస్ జ్వరం, పసుపు జ్వరం, వెస్ట్ నైల్ జ్వరం, జపనీస్ ఎన్సెఫాలిటిస్ (అన్నీ దోమల ద్వారా సంక్రమిస్తాయి), టిక్-బోర్న్ ఎన్సెఫాలిటిస్ (టిక్ ద్వారా వ్యాపిస్తుంది) మరియు ఒరోపౌచ్ జ్వరం (కులికోయిడ్స్ ఈగలు వ్యాపిస్తాయి)వెక్టర్ ద్వారా సంక్రమించే అనేక వ్యాధులను రక్షణ చర్యలు మరియు సమాజ సమీకరణ ద్వారా నివారించవవచ్చునని తెలిపారు.

# సిపిఐ పార్టీ జాతీయ నాయకుని మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటు

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్

**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కమ్యూనిస్టు పార్టీ యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి ఆకస్మిక మృతి వామపక్ష పార్టీలకు తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడిమె సునీల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి యోహాను, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక కడప జిల్లా అధ్యక్షులు చిన్న ఒబిగాండ్ల ఓబయ్య, అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి వామపక్ష భావాలు కలిగిన అఖిలభారత విద్యార్థి సమాఖ్య నుండి ఆయన ప్రస్థానం ప్రారంభమైందని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో క్రమక్రమంగా రాష్ట్ర కార్యదర్శిగా జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారు రెండు దపాలు పార్లమెంట్ సభ్యునిగా నల్లగొండ పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించారు 2000 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచడం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విద్యుత్ ఛార్జీల ఆందోళనలో కీలక పాత్ర పోషించారు. అనేక ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు 1942 లో మార్చి 24న నాగర్ కర్నూల్ జిల్లాలోని కొండ్రావుపల్లెలో సురవరం సుధాకర్ రెడ్డి 1942 మార్చి 25న నాగర్ కర్నూలు జిల్లా లోని కొండ్రావుపల్లె లో సురవరం వెంకట్రామిరెడ్డి ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. అయితే ఆయన సొంత ఊరు జోగులంబ గద్వాల్ జిల్లా ఉండవల్లి మండలంలోని కంచపాడు ప్రాథమిక విద్య అనంతరం కర్నూల్ లోని ఉస్మానియా కళాశాలలో బిఎ చదివారు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో కళాశాలలో ఎల్ఎల్బి పూర్తి చేసి విద్యార్థి దశ నుండి వామపక్షాల ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషిస్తూ పాల్గొనేవారు ఆయన ఏ పదవిలో ఉన్న అన్నదైన ప్రత్యేక ముద్ర కమ్యూనిస్టు పార్టీ భావాలతో ముందుకు సాగేవారని ఆయన మృతికి చింతిస్తూ ఆయనకు ఆయన చిత్రపటానికి పూల మాలలతో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

